# తనను తాను తెలుసుకున్నవాడే దైవమును తెలుసుకోగలడు

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యంబునందణగె సర్వ సృష్టి
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న
శుద్ధసత్త్వమిదియె చూడరయ్య.

మానవుండు పుట్టె మాధవునందుండి
మానవత్వమేల మరుగుపడియె?
మాయ మాయ యిదియె మానవ జన్మంబు
మాయనరుడు కాదె మానవుండు?

ప్రేమస్వరూపులారా!

మానవత్వమన్నది దివ్యత్వముతో కూడినదేగానీ ప్రత్యేకించి ఏర్పడినది కాదు. 'ఏకాత్మ సర్వభూతాంతరాత్మ.' ఒకే ఆత్మ అందరియందున్నది. అందరి ఆత్మ ఒక్కటిగనే అనేకత్వములోని ఏకత్వమును నిరూపిస్తూ వచ్చింది. దేహమునకు అనేక అంగములున్నవి. చేతులు, కాళ్ళు, ముక్కు, నోరు, చెవులు, తల యివన్నీకూడ శరీరమునకు సంబంధించిన అంగములు. ఐతే యీ అంగములకు, శరీరికి సన్నిహిత సంబంధబాంధవ్యమున్నది. కనుక, జీవుడే శరీరి. అంగములే శరీరము. శరీరి, శరీరములు అవినాభావ సంబంధములు. ఈ శరీరికి సర్వ అంగములు తనవే! కనుకనే ఏ అంగములను జీవుడు ద్వేషించడు. ఏ అంగము బాధపడినను శరీరి ఆనందించడు. కారణము ఏమనగా అన్ని అంగములు తనవే! అనుభవము తనదే! అటులనే విష్ణువు విశ్వమనే శరీరమును ధరించాడు. ఈ విశ్వమనే సర్వాంగములు విష్ణుస్వరూపమే! కనుకనే ఎవ్వరుకూడను యీ

sri sathyasai vachanamrutam

విశ్వమును విమర్శించరాదు, దూషించరాదు.

**శరీరమే విశ్వము; ఆత్మయే విష్ణువు**

విశ్వమందున్న విష్ణుత్వము, నీయందున్న విష్ణుత్వము ఏకత్వమే! ఏ వ్యక్తిని నీవు దూషించినప్పటికిని నిన్ను నీవు దూషించుకున్నవాడవవుతావు. ఏ వ్యక్తిని నీవు విమర్శించినప్పటికిని నిన్ను నీవు విమర్శించుకున్నవాడవవుతావు. విశ్వమనగా ఏదో మనకు కనుపించే దృశ్యము మాత్రమే కాదు. శరీరమే విశ్వము; ఆత్మయే విష్ణువు. ఈ విష్ణువనే జీవతత్త్వము శరీరములో సర్వవ్యాపకమై ఉన్నది. తన కాలికి ఏమైనా ప్రమాదము జరిగితే తానెంతో బాధపడతాడు. తన కాలు బాధపడుతున్నదని తాను ఆనందించడు. అటులనే దివ్యత్వమనేది సర్వవ్యాపకత్వమై ఉన్నది. యిది మూడు విధములైన స్వరూపములు ధరించినది. స్థూలము, సూక్ష్మము, కారణము అని. స్థూలమే యీ విశ్వము. సూక్ష్మమే మనస్సు. అతిసూక్ష్మమైన కారణమే నిజమైన జీవతత్త్వము. మానవునకు ఐదుకోశములున్నవి. ఈ ఐదుకోశములు మూడుగా విభజిస్తూ వచ్చారు. అన్నమయకోశము స్థూలమైన దేహము. ప్రాణమయమనోమయవిజ్ఞానమయ మూడింటియొక్క ఏకత్వమే మనస్సుయొక్క సూక్ష్మస్వరూపము. కారణ దేహము ఆనందమయము. ఇది కూడను పరిపూర్ణమైన ఆనందము కాదు. కారణము ఏమనగా దీనికి అతీతమైన మహాకారణము ఒకటి ఉన్నది. ఆ మహాకారణతత్త్వమే ఆత్మతత్త్వము. కనుకనే స్థూల సూక్ష్మ కారణ స్వరూపమైన దేహమును ధరించటంచేతనే 'త్రిపురసుందరి' అని దీనికి పేరు. ఈ త్రిపురములు ఎక్కడ ఉంటున్నవి? ప్రతి మానవునియందు త్రిపురములుంటున్నవి. ఒక పురము దేహము. రెండవది మనస్సు. మూడవది హృదయము. యీ మూడు త్రిపురములే! ఆత్మతత్త్వము యీ త్రిపురములందు ఏకత్వముగా సంచరిస్తున్నది. ప్రాకృతమైన యీ దేహమునందు ప్రకృతియొక్క తత్త్వము అధికముగా ఉండటంచేత దీనికి 'సుందరి' అనే స్త్రీలింగము పేరు పెడుతూ వచ్చారు. ప్రకృతి స్త్రీతత్త్వము. కనుకనే త్రిపురసుందరి అని యీమెకు పేరు. నవరాత్రులందు త్రిపురసుందరిని ప్రార్థిస్తుంటారు, ఆరాధిస్తూ ఉంటారు.

srisathyasaivachanamrutam

## సర్వదా సర్వకాలేషు సర్వత్ర భగవచ్చింతనం

దురదృష్టవశాత్తు ప్రాచీనకాలమునుండి సత్యమును గుర్తించుకోలేని వ్యక్తులు బాహ్యమైన ఆరాధనలు, ప్రార్థనలందే కాలమును వ్యర్థము చేస్తున్నారు. కనుకనే వారు ఆత్మానందమునకు అతి దూరముగా ఉంటున్నారు. తమకు తామే యీ ఆనందమునకు దూరమవుతున్నారు. 'ఎవరికోసం జగమంత తిరిగినావు? అతను నీలోనే ఉన్నాడు, ఎరుగుమతని!' జగత్తంతా తిరుగుతున్నారు, దైవముకోసమని. అనేక మార్గములలో అన్వేషణ జరుపుతున్నారు, భగవంతునికోసమని. ఎక్కడ ఉన్నాడు భగవంతుడు? తెలిస్తేకదా, అన్వేషణ! ఎక్కడ ఉన్నాడో తెలియనప్పుడు అన్వేషణకు అర్థము లేదు. 'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణస్థితః.' హృదయమునందు ఉంటున్నాడు జీవుడు, అనుకుంటున్నాము. మన కాలిపైన చీమ తిరుగుతూ ఉంటే మనకు తెలుస్తున్నాది. కనుక నీ కాన్షియస్ అనేది అక్కడకూడా ఉంటున్నాది. నీయొక్క ప్రజ్ఞ అక్కడకూడా చేరి ఉంటున్నది. ప్రజ్ఞ సర్వత్ర ఉంటున్నాది. కనుకనే 'ప్రజ్ఞానం బ్రహ్మ' అన్నారు. యీ ప్రజ్ఞాస్వరూపమైన తత్త్వము సర్వవ్యాపకత్వముగా ఉంటున్నది. యిలాంటి ప్రజ్ఞాతత్త్వమును యీ నవరాత్రులందు ప్రకటింపచేసే నిమిత్తమై యీ ఆరాధనలన్నీ ఆరంభమైనాయి.

**అవనియంతయు రమ్యమైన ఆలయము**
**విశ్వమంతయు పరతత్త్వ విష్ణుమయము**
**ప్రకృతి బోధించు నవరాత్రి పరమతత్త్వము**
**సాధనంబున కలదోయి సాయి ప్రేమ**

కనుక, దీనిని సాధనద్వారా మనము సాధించాలి. సాధన అనగా ఏమిటి? సాధన అనగా ప్రత్యేకించి ఒక ప్రదేశమునందుగానీ ప్రత్యేకించిన ఒక పద్ధతియందుగానీ భగవంతుని ప్రార్థించటము కాదు. 'సర్వతఃపాణిపాదం.' 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర భగవచ్చింతనం.' యిది సాధ్యమే!

## తనకంటె భిన్నమైనది ఒకటి ఉన్నది అనే భావము లేకుండా ఉండటమే శరణాగతి

మనము ప్రత్యేకించి భగవంతుని చింతన చేయనక్కరలేదు. ఏ పని చేసినా

sri sathyasaivacham rutam

భగవదర్పితముగా చేసినపుడు కార్యములన్నీ భగవత్ప్రీత్యర్థమవుతాయి. ఈ నవరాత్రులందు అంగార్పణ పూజ అని ఉంటున్నాది. దేహముయొక్క అంగములన్నీకూడను దేహి అయిన జీవునకు శరణాగతితో అర్పితము కావటమే! 'శరణాగతి' అనగా ఏమిటి? ఏ పని చేసినా దానియందు దివ్యత్వమును మనము విశ్వసించటమే! తనకంటే భిన్నమైనది ఒకటి ఉన్నది అనే భావము లేకుండా ఉండటమే శరణాగతి. రెండవది ఉన్నది అనుకున్నప్పుడు అది శరణాగతే కాదు. యిది ద్వైతభావముతో కూడి ఉంటున్నది. ఈ ద్వైతము ఏకత్వము కానేరదు. 'నేను', 'అతను' అనే భావమే రాకూడదు. 'ఏకో వశీ సర్వభూతాంతరాత్మ.' 'ఏకోహం బహుస్యాం' యిలాంటి మంత్రములన్నీ అనేకత్వములో ఉన్న ఏకత్వాన్ని నిరూపించే తత్త్వములే! మనము పూజలు యేవిధముగా చేస్తున్నాము? మానవుడు చేసే పూజలన్నీ భగవంతునికూడా మోసగించే పద్ధతిలో ఉంటున్నాయి. పుష్పము తీసుకుంటున్నాము. 'నేత్రం సమర్పయామి' అని భగవంతునికి సమర్పిస్తున్నాము. అదే 'పుష్పం సమర్పయామి' అని చెబితే ఎంతో బాగుంటుంది. 'నేత్రం సమర్పయామి,' అని చెబుతూ నేత్రమును ఉంచుకుంటున్నాడు; పుష్పమును మాత్రం సమర్పిస్తున్నాడు. యిది భగవత్ ద్రోహము కాదా? 'హస్తం సమర్పయామి' అంటున్నాడు. హస్తమునకు పూవుతాకించి ఆ పుష్పమును భగవంతునికి సమర్పిస్తున్నాడు. 'హస్తం సమర్పయామి' అనగా యీ హస్తముతో చేసేటువంటి సర్వకర్మలు భగవత్ కర్మలుగా ఉంటుండాలి. 'నేత్రం సమర్పయామి' అనగా దేనిని చూచినా భగవత్ స్వరూపకంగా చూడాలి. అప్పుడే యీ 'సమర్పయామి' అనే దానికి అర్థము ఉంటుండాది. చెప్పేది ఒకటి, చేసేది మరొకటి! కనుకనే యిది భగవత్ ద్రోహముగా మారుతున్నది. ఈ విధమైన ఆరాధనలు ఎన్ని యుగములు చేసినప్పటికిని, ఎన్ని జన్మములు చేసినప్పటికి, దైవత్వమును గుర్తింపచేయలేవు.

**స్వార్థమును త్యాగము చేసినప్పుడే పరిపూర్ణ ప్రేమ రూపొందుతుంది**

స్వార్థముతో జీవించే మానవుడు ఎవ్వరిని పరిపూర్ణముగా ప్రేమించలేడు. స్వార్థమును యేనాడు త్యాగము చేయునో అప్పుడే యీ పరిపూర్ణ ప్రేమ రూపొందుతుంది. స్వార్థము కలిగిన మానవుడు మరొకరిని ఏ రీతిగా ప్రేమించగలడు? కనుక భార్యను భర్తైనా, తల్లిని బిడ్డ అయినా బిడ్డ తల్లినైనా స్వార్థముతోనే ప్రేమిస్తున్నారు. తల్లినే స్వార్థంగా ప్రేమించేవాడు

sri sathyasai vahini vachanamrutam

భగవంతుని నిస్వార్థంగా ఎట్లా ప్రేమించగలడు? తన బిడ్డనే తాను స్వార్థంగా ప్రేమించేవాడు భగవంతుని నిస్వార్థంగా ఎట్లా ప్రేమించగలడు? ఈనాడు భగవంతుని ప్రేమించటంకూడను స్వార్థముకొరకే! ఈ స్వార్థము ఉండినంతవరకు పరార్థము అర్థము కాదు. యీ నవరాత్రులయొక్క తత్త్వమంతా నవరంధ్రములతో కూడిన యీ నవపురియొక్క తత్త్వము ప్రకటించు నిమిత్తమై ఏర్పడినది. దేహము పాంచభౌతికము. ఈ పాంచభౌతికమైన దేహమే ప్రపంచము. యిదే విశ్వము. ఈ విశ్వమునందు ఏ భూతములున్నవో దేహమునందు అవే భూతములు ఉంటున్నవి. కనుకనే దీనిని చిన్న విశ్వమని చెప్పవచ్చును. ఈ దేహము అలాంటిదిగా భావించినప్పుడే మనము సరియైన ఆరాధనలు చేసినవారమవుతాము. ఈనాడు ఆధ్యాత్మికమనగా పూజలు చేయటము, వ్రతములు ఆచరించటము, ఉపవాసములు చేయటము అనుకుంటున్నారు. యివన్నీ కేవలము స్వార్థముతోకూడిన కర్మలు. ఏనాడు స్వార్థరహితమైన కర్మలు చేయగలవో అప్పుడే నీవు ఆధ్యాత్మికమార్గములో ప్రవేశించిన వ్యక్తి కాగలవు. యాత్రలు చేయటము ఆధ్యాత్మికమని భావిస్తున్నారు. అదికాదు, ఆధ్యాత్మికము. మానవత్వములో ఉన్న పశుత్వమును నిర్మూలము చేయాలి. ఆ తరువాత మానవత్వాన్ని పోషించాలి. దివ్యత్వముగా మార్చుకోవాలి. యిదియే నిజమైన ఆధ్యాత్మికము. ఎన్ని పూజలు చేసినప్పటికిని మనలో పశుత్వము దినదినమునకు పెరుగుతున్నదేగానీ తరగటం లేదు. మన వ్రతములన్నీకూడను, పూజలన్నీ కూడను మనలో పశుత్వమును పెంచుతున్నాయి. ఈ విధంగా పశుత్వమును పెంచునది రాక్షసత్వమేగానీ ఆధ్యాత్మికముకాదు. క్రమక్రమేణా మనలోని పశుత్వము రాక్షసత్వముగా మారిపోతున్నది. నరకాసురుడు అనగా 'నర' అనే అసురుడు. అనగా నరునియందున్న అసురుడు. ఈ నరుడు అసురుడుగా మారి నరకమునకు కొనిపోతున్నాడు. అటువంటిదానిని సంహరించే నిమిత్తమే యీ దేహారాధన. మానవుడు తనయందున్న విశ్వమును గుర్తించుకోటానికి తాను ప్రయత్నించాలి. భగవత్ తత్త్వమనేది తానే; తనకంటే వేరుగా లేదు. తనను తాను తెలుసుకున్నవాడే దైవాన్ని తెలుసుకోగలడు. నిన్ను నీవు తెలుసుకోలేనివాడవు భగవంతుని యే రీతిగా తెలుసుకోగలవు? మొట్టమొదట నిన్ను నీవు గుర్తించుకో! 'నేను మానవత్వములో జీవిస్తున్నానా? లేక అసురత్వములో పెరుగుతున్నానా? లేక పశుత్వములో

sri sathyasai vachanamrutam

దిగజారుతున్నానా' అని తనకు తానే నిర్ణయము చేసుకోవాలి.

**మనము బుద్ధిపూర్వకముగా ఏనాడు అహంకారమును నిర్మూలించెదమో ఆనాడే నరకాసురవధ**

ఈ నవరాత్రులందు దేవి చాముండేశ్వరిగా రూపొంది నరకాసురుని సంహరించింది అని ఈ దశమిరోజును విజయదశమిగా భావించి చాముండేశ్వరిని ఆరాధిస్తారు. పూర్వము నరకుడనేవాడు సర్వరాక్షసులకు నాయకుడుగా ఉండేవాడు. అనగా సర్వ దుర్గుణములకు, సర్వదురాలోచనలకు, సర్వదుర్బుద్ధులకు నాయకుడు. వీటన్నిటికీ అహంకారే నాయకుడు! కనుక ఈ రోజున అహంకారమనే నరకుని సంహరించాలి. చా-ముండి అనే పేరులో ముండి అనగా తల. 'ముండే ముండే మతిర్భిన్నః' అన్నారు. అనగా ఒక్కొక్కరి తల ఒక్కొక్క రీతిగా ఉంటున్నది. అనగా వివిధ వ్యక్తుల తలలలో వివిధమైన దురాలోచనలు బయలుదేరుతాయి. బుద్ధిద్వారా యీ దుర్గుణములనే అహంకారమును హతమార్చాలి. మనము బుద్ధి పూర్వకముగా అహంకారమును యేనాడు నిర్మూలము గావింతుమో ఆనాడే నరకాసురవధ. యివన్నీ బాహ్యమైన రీతిగా మనము చూచుకుంటూ చాముండేశ్వరి విగ్రహమును పెట్టుకొని మనము పూజిస్తున్నాము. ఆ చాముండి మన ముండిలోనే ఉంటున్నాది. అనగా మన తలయందే ఉంటున్నాది. తనయందే ఉండిన చాముండిని బయట ఎక్కడనుండి తెచ్చి ప్రార్థించగలము? ఒకవేళ ఆవిధంగా ఆరాధన చేసినప్పటికిని reflection of the inner being అనగా లోపల ఉన్నదానినే బయట చేస్తున్నానని భావించాలి. ఈ విధమైన అంతరార్థములను ప్రత్యేకించి ప్రబోధించినవే యీ నవరాత్రులు. జ్ఞానము ఒకరు అందించే పదార్థముకాదు; లేక పెద్దలనుండి పొందేటటువంటిది కాదు. స్వప్రయత్నముద్వారానే దానిని పొందాలి. ఏ విధంగా? ప్రతి ఒక్కటి మనస్సుకు బోధించాలి. మనిషికి బోధించి ప్రయోజనము ఏమిటి? మనిషి వింటున్నాడు, మరచిపోతున్నాడు. మనస్సుకు బోధించాలి. మనస్సుకు బోధించినప్పుడే మనిషి మారగలడు. ఈనాడు మనిషి మారుతున్నాడుగానీ, మనసు మారటం లేదు. యీనాడు చేసే బోధనలన్నీ, శ్రవణము చేసే విషయములన్నీ మనిషికి మాత్రమే చేర్చుకుంటున్నామేగానీ మనసువరకు చేరటం లేదు.

srisathyasaivachanamrutam

## నిస్వార్థ, నిర్మల భావముతో ఆరాధించేవారిని ఎల్లప్పుడు వెన్నంటి ఉండేవాడు షిరిడీబాబా!

పూర్వపు శరీరమందు జ్ఞానము బోధించటమంటే ప్రతి ఒక్కటి వారి వారి చర్యలనే వారికి ఎత్తి చూపించి, జ్ఞానమును బోధించటం. ఎట్లనగా పూర్వము దాము, నానా యిరువురు పాదసేవ చేస్తూ కూర్చున్నారు. బాబా కొన్ని రాగి నాణెములు తీసుకున్నాడు. వాటిని వూరకే అటు యిటూ తిరగవేసి చూస్తున్నాడు. ఏదో కనుపించి, కనుపించకుండా ఉన్నట్లు అటు వెతకటము, యిటు వెతకటము ఇలా అనేక రకములుగా హావభావములు చూపిస్తున్నాడు. దాముతోగానీ, నానాతోగానీ ఏమీ సంభాషణ జరపటం లేదు. ఒక అరగంటవరకు యీ పని చేస్తూ వచ్చాడు. ఇక ఉండలేక, నానా 'స్వామీ! ఏమి మీరు చేస్తున్న పని? చూచిన నాణెమునే మీరు తిరిగి చూస్తున్నారు. పరీక్షించిన నాణెమునే తిరిగి పరీక్షించుతున్నారు,' అని ప్రశ్నించాడు. అప్పుడు చెప్పాడు బాబా 'అరే బేటా! నేను చేసిందే చేస్తున్నాను. చూచిందే చూస్తున్నాను. చెప్పినవే చెప్పుతున్నాను. చూడు! ఆ ఎదురుగా ఉన్న మామిడి చెట్టంతా పూత పూసింది. ఆకులే కనుపించటం లేదు. నిజంగా ఆ పూతంతా కాయలైతే ఆ చెట్టు ఉండగలదా? కొమ్మలన్నీ వంగి విరిగి పోయేటువంటివి. కానీ అట్లు కావటం లేదు. ఏమవుతున్నది? గాలికి పూతంతా రాలిపోతున్నాది. మంచుకు మరికొంత రాలి పోతున్నాది. పక్షులు వాలేటప్పటికి మరికొంత రాలి పోతున్నాది. ఏదో కొంత కాయలుగా తయారయ్యేటప్పటికి ఉడుతలంతా కొరికేస్తున్నాయి. పక్షులుకూడను కొరికి క్రింద పడవేస్తున్నాయి. మానవునికి పూర్వజన్మలైన కోతులంతా కొరికి పారవేస్తున్నాయి. ఈ రకంగా 90 శాతము పూత అంతా పోయిన తరువాత ఏ పది శాతమో ఆ చెట్టుకు కాయలు కాస్తున్నాయి. నిజమే కదా!' 'నిజమే స్వామీ!' అన్నాడు నానా. 'అట్లనే నా దగ్గరకు ఎన్ని వేలమంది వస్తున్నారు? వారందరు ఆధ్యాత్మికంగా పరిపక్వము చెంది పండ్లుగా తయారౌతున్నారా? ఎంతమంది మధ్యలో రాలిపోతున్నారో? చాలామంది కోరికలకోసం వస్తున్నారు. కొంతమంది ధనముకోసం వస్తున్నారు. కొంతమంది విద్యకోసం వస్తున్నారు. కొంతమంది వివాహముకోసం వస్తున్నారు. ఈ రకంగా అనేక రకములైన కోరికలతో వస్తున్నారు. వీరందరిలో దోషాలే ఉంటున్నాయి. ఎవరూ నన్ను కోరేవారు లేరు. నా ఖజానాలో ఉన్న విలువైనదానికి నేను

srisathyasaivachanamrutam

తాళము వేయకుండా పెట్టుకున్నా! కానీ, దాన్ని తీసుకునేవారు ఎవరూ యింకా నా దగ్గరకు రాలేదు. అందుకోసమనే యీ నాణెములను చూస్తూ ఉన్నాను. ఈ నాణెములలో చాలా మటుకు అరిగిపోయినవి ఉన్నాయి. గంటుబడినవి ఉన్నాయి. సొట్టపోయినవి ఉన్నాయి. రంధ్రము పడినవి ఉన్నాయి. ఈ నాణెములు యే విధముగా తమలో దోషములు కలిగి ఉంటున్నాయో అదే విధముగానే వ్యక్తులందు దోషములు ఉంటున్నాయి. ఆ వ్యక్తుల దోషములను నేను చూస్తున్నాను. ఎన్ని రంధ్రములున్నాయి? ఎన్ని గుంటలు పోయినాయి? ఎన్ని దుర్గుణములున్నాయి? ఎన్ని దురాలోచనలున్నాయి. వీరందరు నా అనుగ్రహం అనే ఫలమును భుజించగలరా? కోరుతున్నారు, నేను కావాలని. కానీ మనస్సంతా ప్రకృతిపైన పెడుతున్నారు. నేనెట్లా చిక్కుతాను?' అని వివరించాడు బాబా. బెంగుళూరుకు పోవాలని ధర్మవరంలో నిల్చిపోయి గుంతకల్లు పోయే రైలు ఎక్కుతే బెంగుళూరు ఎట్లా చేరగలడు? అదే విధంగా బాబా కావాలని కోరుతున్నారు. కానీ అందుకోసం తగిన ప్రయత్నాలు చేయటం లేదు. ఇక్కడికి వచ్చే ప్రజలలో వేయికి ఒక్కరో, కోటికి ఒక్కరో బాబా కావాలని ఆశిస్తున్నారు. అంతేగానీ, వచ్చినవారంతా భక్తులు కాదు. ఇక్కడ చేరినవారంతా విద్యార్థులు కాదు. 'అందరిలోను దోషాలు ఉంటున్నాయి. వారి బుద్ధులన్నీ బెండుబారి ఉన్నాయి. ఇంతే కాదు, పరమ భక్తులని భావించేవారుకూడను వారి అభీష్టములు తీరకపోతే విసర్జించిపోతున్నారు, నన్ను. యింకా, కొంతమంది ఎన్నో సందేహాలతో వస్తున్నారు. దైవత్వమును తెలుసుకోవాలని వస్తూ కాళ్లనుండి తలవరకుకూడను అనుమానాలే పెట్టుకుంటున్నారు. యింక వారి మాటలు, వీరి మాటలు ఆలకించి కర్మజీవులై పోతున్నారు. ఏదో కారణములచేత నన్ను దూరము చేసుకొని పోతున్నారు. వీరందరు పాపులేగానీ, పుణ్యులుకాదు. భక్తులు కాదు. యిలాంటి పాపులు నన్ను చేరగలరా?' అని తెలియజెప్పాడు బాబా. ఆ సమయమునకు సరిగ్గా ఒక పటేలు అక్కడకు వచ్చాడు. ఏ రీతిగా వచ్చాడు? 'నాకు కావలసినదంత ధనము ఉంది. నాకు సిరిసంపదలంతా ఉన్నాయి. కుమారులున్నారు. నాకు ఏవిధమైన అసంతృప్తి లేదు. కానీ బ్రహ్మజ్ఞానము కావాలని వచ్చాను, యిక్కడకు' అని చెప్పాడు. 'బాబా! నాకు బ్రహ్మజ్ఞానము

srisathyasaivachanamrutam

కావాల'న్నాడు. బాబా 'ఆ! మంచిదే! ఎంతవరకు ఉంటావు యిక్కడ?' అని ప్రశ్నించాడు. 'తిరుగు ప్రయాణము చార్జీకూడా పెట్టుకు వచ్చాను. మీరు బ్రహ్మ జ్ఞానము యిస్తే తక్షణమే వెళ్లిపోవాలని అనుకున్నాను' అన్నాడు పటేలు. అప్పుడు చెప్పాడు బాబా, 'ఒరే పిచ్చివాడా ధనముపైన ఆశ కలిగినవాడు ధనము వెంటనే పోవాలి. 'జావో! సైతాన్!' యిలాంటివాడవు నా దగ్గరకు ఎందుకు రావాలి? ఆశించేది బ్రహ్మజ్ఞానము, నీ మనస్సంతా ధనతృష్ణ! పో'మని చెప్పాడు. ఈ విధమైన ప్రబోధలచేతనే భక్తుల మనసులలో మార్పు కలుగుతూ వచ్చింది. ప్రతి ఒక్కటి నిర్మల భావముతో మనోశుద్ధితో, నిస్వార్థ భావముతో ఆరాధించినవారికి నిరంతరము వెంట ఉండేవాడు, బాబా.

**బాబా శరీరమును విడిచిపెట్టినా తాను సర్వత్రా ఉంటున్నానని నిరూపించాడు**

మాతాజీ కృష్ణ ప్రియ అనే ఒక ఆమె ఉండేది. ఆమె పేరు కృష్ణప్రేమ. ఆమె పూర్వము నాగపూర్‌లో ఉండేటువంటిది. కానీ అప్పుడప్పుడు షిరిడీకి వచ్చి బాబాను దర్శించేది. ఆమె కృష్ణ భక్తురాలు. ఒకనాడు ఆమె సిమ్లాకు వెళ్లింది. ఎక్కడున్నా ఎప్పుడూ ఆమె మనస్ఫూర్తిగా బాబాను ప్రార్థించేది. ఐతే కృష్ణుడు, బాబా ఇద్దరు ఒక్కటే అనే భావముతో ఉండేది. వారిద్దరు వేరు, వేరు కాదు అనే నమ్మకంతో ఉండేది. ఒక తల్లి ఉన్నదనుకోండి! ఆమెను నీవు 'అమ్మ' అని పిలుస్తావు. కోడలు 'అత్త' అని పిలుస్తుంది. మనుమడు 'అవ్వా!' అని పిలుస్తాడు. భర్త 'భార్యా!' అంటాడు. వీరందరు అనేక పేరులతో పిలుస్తున్నారు; కానీ, యీమె ఒక్కతే వ్యక్తి. అదే రీతిగా దివ్యశక్తి ఒక్కటే! భక్తులు 'దేవీ' అని పిలుస్తారు. జ్ఞానులు 'ఆత్మ' అని పిలుస్తారు. యోగులంతా 'శక్తి' అని పిలుస్తారు. ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్క పేరుతో పిలుస్తారు. అదే విధముగా ఆ కృష్ణప్రియకు బాబా, కృష్ణ వేరు, వేరు కాదు. అది ఆమె నమ్మకము. సిమ్లాపోయిన తరువాత బాబా 1918వ సం॥ము అక్టోబరు 15వ తేదిన మద్యాహ్నం 2 1/2 గం॥లకు తన దేహమును వదిలాడని ఆమెకు తెలిసింది. ఆ రోజు విజయదశమి. బాబా శరీరము వదిలే సమయానికి ఏకాదశికూడా ప్రారంభించింది. బాబా అంతకు పూర్వమే 1916 సం॥లోనే చెప్పాడు, కాకా దీక్షిత్‌కు, 'కాకాజీ దాదా! 1918 సెప్టెంబరు 28వ తేదీ చనిపోతున్నాడురా!' అని. అనగా దాదా సాహెబు ఒకడు ఉన్నాడు అతను చచ్చిపోతాడేమో అనుకున్నాడు, యీ కాకా దీక్షిత్.

sri sathyasai vachanamrutam

మళ్ళీ చెప్పాడు, 'కాకాజీ! రా! నీవు దాదాకు చెప్పవద్దు' అని. ఈ విధంగా జరుగుతుంటే దాదా యింకా రెండు నెలల్లో పోతాడనే ఉద్దేశ్యముతో బాధ పడుతూ వచ్చాడు, కాకా. 1918లో సెప్టెంబరు 28వ తేదీ బాబాకు తీవ్రమైన జ్వరము వచ్చింది. ఐతే దానికి రెండు దినాలకు ముందుగా మూడిండ్లకు పోయి భిక్షము తెచ్చుకున్నాడు. అది భుజించాడు. 12 గం॥లకు చెప్పాడు 'యీ చావడిలో నాకు యిష్టము లేదు. నన్ను బూటీవాడకు తీసుకుపొండి. అక్కడ నాకు ప్రశాంతముగా ఉంటుంది' అన్నాడు. బూటీ అనేవాడు మురళీధర మందిరమనేదానిని కట్టాడు. అక్కడ కృష్ణుని ప్రతిష్ఠించాలని తాను ఎంతో ప్లాను వేశాడు. ప్రతి పర్యాయము 'రేపు ప్రతిష్ట,' 'రేపు ప్రతిష్ట' అంటూ బాబా దానిని నిలబెడుతూ వచ్చాడు. బాబా ఆజ్ఞ లేకుండా బూటీ తనంతట తాను ఏమీ చేయలేడు. చివరివరకు బాబాను బూటీవాడకు తీసుకొని పోలేదు. ఒకరోజు మధ్యాహ్నం బూటీని, కాకాజీని 'మీరు పోయి భోజనము చేసుకుని రండ'ని పంపించాడు బాబా. సరే అని వారు వెళ్లారు, యింటికి. బాబా పండుకుని ఉన్న దిండుక్రింద 9 నాణెములు ఉంటున్నాయి. వాటిని తీసాడు. లక్ష్మీబాయి చేతిలో పెట్టాడు. ఆ సమయంలో శ్యామ అక్కడే ఉంటున్నాడు. 'శ్యామ! ఇటురా!' అని పిలిచాడు. వాడు ప్రక్కకు పోయి కూర్చున్నాడు. శ్యామపైన వ్రాలాడు. ప్రాణం వదలాడు! ఈ విషయము అక్కడ కృష్ణప్రియకు తెలిసింది. ఆమె చాలా బాధ పడింది. రెండవ దినము ఆమె తలుపులు మూసుకుని ఉంది, తన గదిలో. సిమ్లాలో మంచు బాగా పడుతూ ఉంటుంది, పగటి పూటకూడను. ఈ విధంగా ఉంటున్నప్పుడు ఆజానుబాహుడుగా ఉన్న ఒక సన్యాసి తలకు బట్ట కట్టుకొని పక్కింటికి వచ్చాడు. తలుపు తట్టాడు. ఆ ప్రక్కింటి స్త్రీ తలుపు తెరచి 'ఎవరండి మీరు?' అన్నాది. 'మాతాజీ కృష్ణప్రియ ఎక్కడ?' అన్నాడు. తనకు తెలియక కాదు, తనకు తెలుసు. సిమ్లాలో ఉన్నదని తెలిసినవాడు, సిమ్లాలో యిల్లెక్కడ అని తెలియదా? అనగా 'బయటవారికికూడను తాను శారీరకంగా దర్శనం యిచ్చాడు,' అనేటువంటిది తెలియటం కోసమని బాబా అలా చేశాడు. 'అదుగో! ఆ యిల్లేనండి' అని చూపించింది ఆమె. ఆ సన్యాసి వృద్ధుడు కావటంచేత, పైన మంచు పడుతుండటంచేత గొడుగు పట్టుకొని కృష్ణప్రియ యిల్లు చూపించమన్నాడు. కృష్ణప్రియ యింటికి వచ్చాడు. బాబా

srisathyasaivachanamrutam

తలుపు తట్టాడు. ఆమె తలుపు తెరిచింది. నమ్మలేక పోయింది! 'ఏమిటి? బాబా! మీరు నిన్ననే పోయినారని తెలిసింది నాకు; అటువంటిది యీ చలిలో ఎలా వచ్చావు? షిరిడీనుండి యిక్కడకు రావాలంటే మూడు దినాలైనా పడుతుంది కదా!' అని ఆశ్చర్యపోయింది. అప్పుడు బాబా 'బేటీ! నేను ఎక్కడ ఉన్నాను? ఎక్కడ చూచినా నేను ఉన్నాను కదా! యింతకాలము నీవు నన్ను పూజిస్తున్నావు, కృష్ణ భావముతో! యిదేనా నన్ను తెలుసుకోటం? నాకు చలిగా ఉంది, మొదట ఒక కప్పు చాయ్ యివ్వమ'న్నాడు. తక్షణమే లోపలికి పోయి చాయ్ చేసి కప్పులో తెచ్చింది. చాయ్ త్రాగినాడు. కూర్చున్నాడు. తిరిగి 'నాకు ఆకలౌతున్నాది' అన్నాడు. 'కృష్ణా! యింతదూరం వచ్చేటప్పటికి పొట్టలో ఉన్నదంతా అరిగిపోయింది' అన్నాడు. ఆమె లోపలకి వెళ్లి చపాతీ, వంకాయకూర తీసుకువచ్చి పెట్టింది. వంకాయ అంటే బాబాకు చాలా యిష్టము! ఆనాడు ఎందుకో పాపం, యీమె కూడను వంకాయ వండుకుంది. అది తీసుకుని వచ్చింది. తిన్నాడు. నీరు తెచ్చి యిచ్చేటప్పటికి చేయి కడుక్కున్నాడు. టవలుకూడా తెచ్చి యిచ్చింది. బాగా తుడుచుకున్నాడు. 'నేనింక వచ్చిన పని అయిపోయింది. యింక బయటకు వెళ్లిపోతాను,' అన్నాడు. ఆనాడు ఎవరూ బాబాకు జవాబు చెప్పే అలవాటు లేదు. ఎవరైనా యిది కాదు అన్నారంటే కొట్టటమే! ఏమాత్రం సహించటం లేదు. అందువల్ల ఆమె ఏమీ చెప్పలేక పోయింది. 'మంచిది స్వామీ!' అనింది. 'యిదుగో! యీ మాల తీసుకో!' అని ఒక మల్లెపూల మాల యిచ్చాడు. రోడ్డుపైన నడచుకొని వెడుతున్నాడు. చాలా దూరంవరకు బాబాను చూచింది. అక్కడ సిమ్లాలో రోడ్డు నూరు అడుగులకు ఎత్తుపల్లములుగా ఉంటుంది. కొంతమంది కూలివారు పని చేస్తున్నారు, ఆ సమయములో. అక్కడకు పోయినాడు. ఒక లోయలో పడ్డాడు. అక్కడ ఉన్న కూలివాళ్లందరు అరిచారు, 'ఒక సన్యాసి వచ్చాడు, లోయలో పడి చచ్చిపోయార'ని. కాని, దేహము కనబడలేదు. బాబా అంతర్థానమయ్యాడు. ఈ విధంగా మాతాజీ కృష్ణప్రియ కూడను, కొన్ని అనుభవాలు పొందింది. బాబా శరీరమును వదలినాడుగానీ తాను సర్వత్ర ఉంటున్నాను అని చెప్పి పోయాడు, వెళ్ళిపోయేముందు. '1926లో నన్ను వచ్చి చూడు' అన్నాడు. ఎక్కడ చూడాలి?ఎప్పుడు చూడాలి? ఎక్కడకు పోవాలి? అన్నీ

srisathyasaivahini.org

శేషప్రశ్నలే! నేను సిమ్లాకు పోయినప్పుడు కృష్ణప్రియ అనే ఆమె వణుకుతూ వణుకుతూ కఱ్ఱ పట్టుకొని వచ్చింది, నన్ను చూడటానికి!

## ఆధునిక విద్యవల్ల మానవత్వమునే మరచిపోతున్నారు

ఇలాంటి దివ్యసందేశాలతో కూడినది, షిరిడీతత్త్వము. షిరిడీలో జ్ఞానము బోధించటము కేవలము ఉపన్యాసములతో కాదు. అన్నీ కఠినమైన స్థితిలో బోధిస్తూ వచ్చాడు, బాబా. ఎందుకంటే, ఆనాటి వాతావరణం ఆరకంగా ఉండేది. ఒకానొక సమయములోపల దాదా భార్య ఒక బిడ్డను తీసుకువచ్చింది. కొన్ని దినములు షిరిడీలో ఉండాలని పతియొక్క అనుజ్ఞ తీసుకొని వచ్చింది. అప్పుడు అక్కడ ప్లేగు చాలా జాస్తి. ఆ బిడ్డకు జ్వరము వచ్చింది. వళ్లంతా పెద్ద పెద్ద బొబ్బలు మాదిరి వచ్చేసినాయి. 'అయ్యో! నా భర్తకు ఇష్టం లేకపోయినా నేను వచ్చానే, నా బిడ్డకు యిక్కడ ప్లేగు వచ్చింది. నన్ను రక్షించేవారు ఎవరు?' అని బాధ పడింది. తరువాత ఆ బిడ్డను తీసుకొని మసీదుకు పోయింది. 'బాబా!, బాబా!' అని అరచింది. 'ఏమి వచ్చావు? నీ బిడ్డకు జ్వరము వచ్చిందా! బొబ్బలు పుట్టాయా' అని అడిగి 'ఆ బిడ్డకే కాదు, నాకు కూడా' అని చొక్కా తీసి చూపించాడు బొబ్బలు. పక్కనే మహల్సాపతి ఉన్నాడు. 'ఏమిటి స్వామి! యింత పెద్ద పెద్ద బొబ్బలు' అంటూ అక్కడ పట్టి చూచాడు. బాబాకు తీవ్రమైన జ్వరం వచ్చి $105^0$ వరకు ఉంటున్నాది. అప్పుడామె 'అయ్యో! పాపం! నా కుమారునికే కాదు, తమకుకూడా వచ్చిందా? తమను రక్షించేవారు ఎవరు?' అని యీ విధంగా తాను బాధపడుతూ వచ్చింది. 'సర్వరక్షకుడవు నిన్ను రక్షించేవాడు యింకొకడు ఉన్నాడా? స్వామీ! నా అపరాధము క్షమించమ'ని చెంపలు వేసుకుంది. మరికొంతసేపులోపల బాబాకు జ్వరము తగ్గిపోయింది. ఆనందముతో యింటికి వచ్చింది. యింటికి వచ్చేటప్పటికి తన బిడ్డకుకూడా బొబ్బలు లేవు, జ్వరము లేదు. 'బాబా! నా బిడ్డయొక్క బాధనంతా నీవు స్వీకరిస్తివా' అని బాబాకు కృతజ్ఞతలు తెలుపుకుంది. యీ విధంగా ప్రతి ఒక్కటి అప్పటికప్పుడే పరిణామములు చూపించుతూ వచ్చాడు బాబా. దీనికి మూలకారణం ఏమిటి? పరిపూర్ణ విశ్వాసమే ఆనాడు. ఏది చెప్పినా తూచా నడుచుకునే భక్తులు. కానీ యీనాడు అదికాదు. ఏదైనా చెబుతే దానికి పది ప్రశ్నలు వేస్తారు. ఆ పది ప్రశ్నలు వేసినప్పటికిని ఇంకా వారికి తలనుంచి కాలివరకు డౌట్సే! కారణము, నవీన విద్యయొక్క

ప్రభావమే! ఈ నవీన విద్యవల్ల మానవత్వమునే మరచిపోతున్నారు. మహా క్రూరులై కృతఘ్నులుగా మారిపోతున్నారు. అన్నీ మరచిపోతున్నారు. చెడ్డను మాత్రము హృదయములోపల అభివృద్ధిపరచుకొంటున్నారు. మానవునియందు యీనాడు అసురత్వము పెరిగిపోతోంది. ఆనాడు మానవునియందు మానవత్వమైనా ఉండేది. యీనాడు మానవుడు కేవలం మానవ ఆకారమేగానీ అంతా పశుతత్వముతో ఉంటున్నాది. ఏది కోరినా స్వార్థమే! తన కోరిక నెరవేరెనా 'బాబా!' 'బాబా!' అని నవ్వుతూ వస్తారు. భిన్నమాయెనా వేరుగా మారిపోతారు. యిలాంటి క్రూరమృగములుగా ఉండే మానవత్వంలో బాబా భక్తి ఏ విధంగా అభివృద్ధి కాగలదు? ఆకారము మానవుడుగానీ, ప్రవర్తన మృగ ప్రవర్తనగా ఉంటున్నది. ఏనాడు మనయందున్న క్రూరమైన మృగత్వము నాశనము చేసుకుంటామో ఆనాడే మనము మానవులుగా రూపొందుతాము.

**ఆనాడు బూటీ నిర్మించిన మురళీధర మందిరమే యీనాడు సమాధి మందిరము**

బాబా దేహమును వదలిన తీరునుకూడను మరికొంత విచారణ చెయ్యాలి. మొట్టమొదట సెప్టెంబరు 28వ తేదీ జ్వరము వచ్చింది. తరువాత 15 దినములు బాగా ఉంటున్నాడు. అక్టోబరు 15వ తేదీ తిరిగి అక్కడ ఏమీ కనుపించలేదు. బాబా దేహమును వదలినది అక్టోబరు 15వ తేదీ. బాబా శరీరమును వదలటం వదలినాడు కానీ అక్కడ అనేక సమస్యలంతా వచ్చాయి. మహమ్మదీయులంతా వచ్చారు. ఈ దేహము మాకు చెందినదని వారు పోట్లాడుతూ వచ్చారు. హిందువులందరు యీ శరీరము మాకు చెందవలసినది అని వాదించారు. 'అల్లామాలిక్,' 'అల్లామాలిక్' అనేటువంటివాడు ఎప్పుడూ బాబా. కనుక యితను మహమ్మదీయుడని వారు, రామ మాలిక్, కృష్ణామాలిక్ అనేటువంటి వాడు మరొక వైపున, అందువలన ఆయన హిందువు, మాయొక్క బాబా అనేవారు. ఈ పరిస్థితులలో బాబా శరీరమునకు అంత్యక్రియలు ఏవిధంగా చెయ్యాలి అనేది తీర్మానము కాకుండా 36 గంటలు ఆ శరీరమును అట్లే పెట్టారు. కడపటికి వీరిరువురికి ఏవిధమైన కలహములు సంభవిస్తాయోనని పోలీసులు, కలక్టరు, అందరు చేరారు షిరిడీకి. షిరిడీలో ప్రజలనంతా పిలిపించారు. అక్కడ ఒక వోటింగ్ విధానము పెట్టారు. ఏవిధంగా బాబా శరీరమునకు కర్మలు చెయ్యాలి అనే విషయంలో ఎవరికి మెజారిటీ ఉందని తేల్చారు. అందరూ హిందూ

sri sathyasai vahini / sri sathyasai vachanamrutam

పద్ధతిక్రిందనే చెయ్యాలి అన్నారు. ఆ హిందూ పద్ధతిక్రింద చెయ్యాలనుకున్నప్పుడు బూటీ మందిరంలోపల తవ్వుతూ ఉన్నారు. తిరిగి కొందరు అడ్డం వచ్చారు. అనేక అడ్డంకులు జరుగుతూ వచ్చాయి. కట్టకడపటికి పోలీసులు, కలక్టరు అక్కడ ఉండి బాబా సమాధి ఏర్పరిచారు. ఆనాడు బూటీ నిర్మించిన మురళీధర మందిరమే యీనాటి సమాధి మందిరము.

### విశ్వాసములేనివారు భగవంతునికి దూరమైపోతారు

యింక బాబా మాతాజీ కృష్ణప్రియకు యిచ్చిన మాలను అక్కడ యింటిలో అందరూ చూస్తుండగనే కృష్ణునికి వేసింది యీమె. 'ఏమిరా! సాయిబాబా భక్తురాలుగా ఉండి మాలను కృష్ణుని మెడలో వేసింది ఈమె, సాయిబాబాకు ఎందుకు వేయకూడదు' అని కొంతమంది సందేహించారు. అందరూ భజన చేస్తున్నారు. కృష్ణుని మెడలో వేసిన పూలమాల వచ్చి సాయిబాబా మెడలో పడిపోయింది. చివరకు, బాబా మరియు కృష్ణుడు ఒక్కరేనని సిమ్లాలో అందరూ ఆనాడు ఆనందించారు. తెల్లవారి లేచి చూచేటప్పటికి ఆ కృష్ణుని మెడలో బాబా యిచ్చిన మాల లేదు. ఈ బూటీ మందిరములోపల సమాధిపైన ఉంటున్నాది. ఎందుకోసం యీ విధమైన మిరకిల్స్ చూపాలి, బాబా? ఆనాడు హిందు, మహమ్మదీయులకు చాలా విరోధము ఉండేది. ఈ మతకలహములు ఉండకూడదనే ఉద్దేశ్యముతో బాబా 'సర్వ జీవులకు ఒక మాష్టరే! అతనికి కులమత భేదములు లేవు. సర్వులకు సమన్వయమైన మతమే బాబా మతము. అదే సర్వులకు హితము. అదే ఋషులకు వ్రతము. అదే మానవమతము' అని బోధించాడు. అదే సత్యమును చాటుతూ రావటం కోసమని యిన్ని అద్భుతాలు చూపవలసి వచ్చింది. మానవత్వములో బోధలు చేయటమంటే ఒకరు అందించే బోధలు కావు, యివి. ఎవరిమటుకు వారు తనకు తానై స్వప్రయత్నముచేత విశ్వాసమును పెంచుకోవాలి. విశ్వాసములేనివారు అనేక విధములుగా భగవంతునికి దూరమైపోతుంటారు. ఈవిధంగా దూరము కావటానికి వారి ప్రారబ్ధ కర్మలే మూలకారణము. ఎంతో కాలం ఉంటారు యిక్కడ. కానీ ఏదో ఒక కారణమును పురస్కరించుకుని బయటకు వెడుతుంటారు. యిది వారి కర్మయొక్క ప్రభావము.

sri sathyasai vachanamrutam

మానవులుగా ఉండిన వారికి కర్మ ఏమాత్రము వదలదు.

**కర్మ దాట వశమా నరుడా? కర్మ దాట వశమా?**
**చిన్న చెలమలో ముంచిననైనా సప్తసాగరాల్ నించిననైనా**
**కడవెంతో నీరంతేరా కావాలన్నా ఎక్కువ రాదుర ॥కర్మ॥**
**ధనికుడు తృటిలో బికారికాడా? పండితుడింతలో పశువైపోడా?**
**కళ్లు పామై కరవను రాదా? కర్మ హేతువు కర్మే మూలము ॥కర్మ॥**
**భుజబలమెంతో చూపినగాని మొనగాడనుచు మురిసిననైన**
**ముక్కుకు త్రాడై ముందుకులాగే ఆముగదాడే కర్మరా**
**ఘన పాఠంబులు చదివినగాని కులదేవతలను కొలచినగాని**
**కారడవులకే పోయినగాని కఠిన తపస్సులే చేసినగాని ॥కర్మ॥**

కనుక ఎంతో గొప్ప భక్తులుగా ఉండినవారంతా క్రమక్రమేణా జారిపోతుంటారు. అంతకు పూర్వము భక్తులుగా ఉండినారనుకోటం చాలా పొరపాటు! అప్పుడుకూడా వారికి భక్తిలేదు. కేవలం యివంతా నాటకాలు. ఉన్న భక్తి పోదు, లేని భక్తి రాదు. ఆనాడుకూడను లేదనే అర్థము. ఆనాడు ఉండి యీనాడు పోయిందంటే అది నమ్మటానికి వీలుకాదు. ఆనాడుకూడను భక్తి ఉన్నట్లు ఒక నాటకమాడుతూ వచ్చారు.

**పూర్ణప్రేమతో ఉండినవారి భక్తిలో ఎట్టి మార్పు రాదు**

కర్మ తత్త్వమనేది ఎన్నో రూపాలుగా మారుతుంటాది. 'అయ్యో! స్వామి అంటే ప్రాణసమానంగా ఉండేవారే ఎట్లా వదలిపోయారంటే, ప్రాణసమానంగా ఉండటం నటనేగానీ భక్తి కాదు. నిజముగా భక్తి ఉన్నవాడు వదలిపోడు. వదలిపోయేవాడు భక్తుడు కాడు. కనుక, భక్తితత్త్వమును నిర్ణయించాలంటే ఎవరికి సాధ్యము కాదు.

**ప్రబలి కఫంబు కంఠమున బాధలు పెట్టెడు వేళ బంధువుల్**
**గబగబ బైటపెట్టుడిక లాభము లేదనువేళ కింకరుల్**
**దబదబ ప్రాణపాశములు లాగెడువేళ ఆలుబిడ్డలున్**
**లబలబ ఏడ్చువేళ తరమా హరినామము నోట పల్కగన్!**

sri sathyasai vachanamrutam

అది సాధ్యమే కాదు. ప్రారంభమునుండి దృఢమైన భక్తిగా ఉంటే అది మారటానికి వీలు లేదు. స్వార్థ, స్వప్రయోజనములతో జీవించే వ్యక్తులకే యిలాంటి మార్పులు. పూర్ణప్రేమతో ఉండిన వారి భక్తిలో ఎట్టి మార్పురాదు. అదే అచంచల భక్తి. అదే అవినాభావసంబంధము. అలాంటి భక్తి రావాలి. అప్పుడే భగవంతుని హృదయము కరుగుతుంది. భగవంతుడు కదులుతాడు. ఆ కరగించే భక్తిని మనం అభివృద్ధిపరచుకోవాలి. ఈ నవరాత్రులందు యిలాంటి దివ్యశక్తిని మనం అభివృద్ధిపరచుకొని దైవత్వమును ప్రత్యక్షముగా మనము చూచే ప్రాప్తికి తగిన కృషి చేయటమే యీ నవరాత్రియొక్క పూజలు. దైవము ఎక్కడో లేడు, మనయందే ఉంటున్నాడు. మన చుట్టూనే ఉంటున్నాడు. మనలోపలనే ఉంటున్నాడు. మనం దానిని గుర్తించుకోటానికి ప్రయత్నించటం లేదు. నేను వేరు, దేవుడు వేరని భిన్నత్వంలోనే జీవిస్తున్నాము. ఈ రెండింటిని కలిపేది ఒకటి ఉంటున్నాది. అదే ప్రేమ. యిక్కడ ఒక కాగితం ఉంటున్నాది. ప్రక్కన వేరొక కాగితం ఉంటున్నాది. ఈ రెండింటిని మనం చేర్చాలంటే ఏమి చెయ్యాలి? ఈ రెండింటికి మధ్యలో బంకను వెయ్యాలి. అప్పుడు యీ రెండు చేరిపోతాయి. జీవాత్మను, పరమాత్మను చేర్చేది యీ ప్రేమ అనే బంక. ఈ ప్రేమ అనే బంకను వేసినప్పుడే జీవాత్మ పరమాత్మలో ఏకమైపోతుంది. ఈ ప్రేమ ప్రాకృతమైన దీంట్లో ప్రవేశపెట్టకూడదు. దైవత్వములోనే ప్రవేశపెట్టాలి. అలాంటి పరిపూర్ణ ప్రేమతత్త్వాన్ని మనం యీనాడు అలవర్చుకోవాలి.

**పురుషప్రయత్నము ఉండినప్పుడే భగవంతుని అనుగ్రహము లభిస్తుంది**

ప్రేమస్వరూపులారా! మనము తినే ఆహారమునుబట్టి, సంచరించే పరిసరములనుబట్టి మానవత్వములో అనేక సందేహములు పుడుతూ ఉంటాయి. యిలాంటి సందేహములకు లొంగి మనము దురదృష్టవంతులుగా మారకూడదు. ఆవిధంగా మీలో మార్పులేమైనా కలుగుతే యిది కేవలము మీ నొనటివ్రాతే! దానిని సరైన రీతిలో సాధించాలి. కష్ట, నష్టములను నెట్టుకొని, తట్టుకొని సాగిపోవాలి. తుచ్ఛమైన సందేహములకు ఏమాత్రం అవకాశము యివ్వకూడదు. యివన్నీ మీలో ఉండే సంకల్పములేగానీ, దైవములో ఉండేవి కాదు. దైవము ఎప్పుడు వజ్రమువంటివాడు. అలాంటి వజ్రము ఏమాత్రము మార్పు

sri sathyasai vahini

చెందదు. ఇది ఒకరివల్ల పెరిగేది కాదు, మరొకరివల్ల తరిగేది కాదు. 'బాబా! నాకు అది చేయి, యిది చేయి! నా మనసు మార్చు' అని చెప్పితే యిది బాబా పనా? నీ కర్తవ్యమును నీవు నిర్వర్తించు. అన్నీ బాబా చేస్తుంటే నీవు చేసే పని ఏమిటి? యిది కేవలము సోమరత్వమే! యిలాంటి laziness is dust and rust. అలాంటివి ముట్టడు బాబా. మీ ప్రయత్నముతో మీరు సాధించాలి. నీ పురుషప్రయత్నంలో నీవు ప్రవేశించాలి. అప్పుడే భగవంతుని సహాయము కలుగుతుంది.

**యత్నప్రయత్నములు మానవధర్మము**
**జయాపజయములు దైవాధీనములు**

'భగవంతుడా! అది చేయి, యిది చేయి, నా మనసు మార్చు' అని యివంతా కోరటము బలహీనునియొక్క లక్షణాలు. నీలో పరిపూర్ణ విశ్వాసమే ఉంటే ఎందుకు మారదు? అది మీలో లేదు కాబట్టి 'నన్ను మార్చు' అని కోరుతున్నారు. మార్చే పని కాదు, నాది! నీ కర్మ తీర్చే పని, నాది. కనుక, ప్రతి వ్యక్తి యీ సత్యాన్ని గుర్తించి వర్తించటం అత్యవసరము. మొట్టమొదట నీలోని దోషాలు నీవు నిర్మూలం చేసుకో! నీయొక్క భక్తి, ప్రపత్తులు స్థిరమైనవిగా చూచుకో! ఎలాంటి పరిస్థితియందు మార్పు లేకుండా చేసుకో! అది నీ పురుష ప్రయత్నము. అప్పుడే భగవదనుగ్రహముకూడా వస్తుంది. ఈ సత్యమార్గములో ప్రవేశించి, ప్రేమ మార్గములో మనము నడచి, అనంతమైన దివ్యత్వములో లీనము కావాలి.

**(తేదీ 06-10-1992న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam